

నిధులు కాజేశారు..
గ్రామాలను అభివృద్ధి పథంలోకి తేవాలని అధికారమిస్తే కొందరు సర్పంచ్‌లు అందినకాడికి కాజేశారు. 8లో



వన దేవతలకు ప్రణమిల్లి..
చిరుమళ్లలో జాతర నాలుగు రోజులుగా సాగుతుండగా, భక్తులు నమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 18°

వాతావరణం
జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి వేళ చలి ప్రభావం ఉండవచ్చు.

యూనిట్ వన్ రెడీ..



భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్

గతేడాది బీటీపీఎస్‌లో అగ్ని ప్రమాదం

- కాలిపోయిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్
- 8 నెలలుగా నిలిచిపోయిన విద్యుదుత్పత్తి
- పూర్తికావొచ్చిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎనిమిది నెలలుగా ఉత్పత్తికి దూరంగా ఉన్న భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో యూనిట్ వన్ వచ్చే మార్చికి సిద్ధం కానుంది. ఈ యూనిట్‌లో కాలిపోయిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చివరి దశకు చేరుకున్నాయి. బీటీపీఎస్‌ను సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించారు. 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్ల ద్వారా ఇక్కడ మొత్తంగా 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. గతేడాది జూన్ 29న ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా యూనిట్–1లో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. దాదాపు ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటి వరకు మరమ్మతు పనులు పూర్తి కాలేదు. దీంతో గడిచిన ఎనిమిది నెలలుగా యూనిట్ వన్ నుంచి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు.

జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్

బొగ్గును మండించి నీటి ఆవిరితో టర్బైన్లను తిప్పడం ద్వారా బీటీపీఎస్‌లోని ఒక్కో యూనిట్‌లో 16కేవీ సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ (జీటీ)కు పంపిస్తారు. ఇక్కడ ఈ విద్యుత్ 400కేవీగా మారుతుంది. అప్పుడే బీటీపీఎస్‌లో తయారైన విద్యుత్‌ను పవర్ గ్రిడ్‌కు పంపడం సాధ్యమవుతుంది. బీటీపీఎస్‌లో నాలుగు యూనిట్లకు సంబంధించి నాలుగు జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. నాలుగింటిలో కనీసం ఒక్కటి కూడా స్పేర్ ట్రాన్స్‌ఫార్మర్ లేదు. దీంతో అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత యూనిట్ వన్‌లో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది.

డిమాండ్‌లో మార్పులు

గత జూలై నుంచి వానలు మొదలు కావడం, ఆ తర్వాత శీతాకాలం సమీపించడంతో సాధారణంగానే విద్యుత్‌కు డిమాండ్ తగ్గింది. దీంతో బీటీపీఎస్‌లో యూనిట్ వన్‌లో విద్యుత్ ఉత్పత్తి జరగకపోయినా ఆ ప్రభావం పెద్దగా కనిపించలేదు. కానీ గడిచిన రెండు వారాలుగా రాష్ట్రంలో పరిస్థితులు మారిపోతున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా గృహ విద్యుత్ రంగంలో డిమాండ్ అమాంతం పెరిగింది. మరోవైపు రబీ సీజన్‌లో వ్యవసాయం ప్రధానంగా బోర్లపైనే ఆధారపడి ఉంటుంది. దీంతో ఒక్కసారిగా బీటీపీఎస్‌లో విద్యుదుత్పత్తి నష్టం తాలూకు ప్రభావం కనిపిస్తోంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను అందించేందుకు బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు విద్యుత్‌ను కొనాల్సి వస్తోంది.

ఆది నుంచీ విమర్శలే

బీటీపీఎస్ స్థాపనకు ఎంపిక చేసిన స్థలం, ఉపయోగించిన టెక్నాలజీ, పనులు అప్పగించిన తీరుపై ఆది నుంచీ విమర్శలు ఉన్నాయి. దీనికితోడు బీటీపీఎస్ నిర్మాణంలో అవకతవకలను తేల్చేందుకు కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే జ్యుడిషియల్ ఎంక్వైరీ మొదలు పెట్టింది. ఈ వ్యవహారం ఇలా సాగుతుండగానే 2024 జూన్ 29న ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుని యూనిట్ వన్‌కు అనుసంధానంగా ఉండే జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాలిపోయింది. బీటీపీఎస్‌ను ఈపీసీ (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో బీహెచ్‌ఈఎల్ సంస్థ నిర్మించింది. దీంతో ఈ ప్రమాదానికి కారణం పిడుగు పాటా లేక సాంకేతిక సమస్యలా అనే అంశంపై నెలలపాటు విచారణలు జరిగాయి. ఆ తర్వాత జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత తీసుకోవాలనే అంశంపైనా అనేక రోజులపాటు తర్జనభర్జన పడ్డారు.

సొంత ఖర్చులతో

చర్చోపచర్చల అనంతరం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయడంతోపాటు స్పేర్‌గా మరో కొత్త జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రూ.5 కోట్ల వ్యయంతో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు జరుగుతున్న మరమ్మతులు చివరి దశకు చేరుకున్నాయి. రూ.20 కోట్ల వ్యయంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కొనుగోలుకు ప్రణాళిక సిద్ధమైంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ తయారు చేయడానికి పద్దెనిమిది నెలల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి వచ్చేలోపు మరమ్మతుల్లో తేడా వస్తే సమస్య మళ్లీ మొదటికి వస్తుంది.

మార్చి లోగా సిద్ధం

కాలిపోయిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. రిపేర్ల పనులు చివరి దశకు చేరుకున్నాయి. మార్చి నాటికి యూనిట్ వన్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం.

–బిచ్చన్న, బీటీపీఎస్ సీఈ

రూ.100 కోట్ల రాబడి!

- పెరిగిన బీర్ల ధరతో ఉమ్మడి జిల్లాలో అదనపు ఆదాయం
- 15 నుంచి 20 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- గతేడాది 20 లక్షల కేసుల విక్రయాలతో రూ.400 కోట్లు

పాల్వంచరూరల్: వేసవి కాలంలో అధిక విక్రయాలు జరిగే బీర్ల ధరలను ప్రభుత్వం పెంచింది. వివిధ కంపెనీల బీర్లపై 15 నుంచి 20 శాతం రేటు పెంచడంతో మందుబాబులపై అదనపు భారం పడనుంది. ఉమ్మడి జిల్లాలో గతేడాది 20 లక్షల కేసుల బీర్లు అమ్ముడుపోగా రూ. 400 కోట్ల ఆదాయం లభించినట్లు వైరా బేవరేజస్ కార్పొరేషన్ డీఎం కాశినాథం తెలిపారు. ఇప్పుడు ధరల పెంపుతో మరో రూ. 100 కోట్లు పెరగనున్నట్లు అంచనా వేస్తున్నారు. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, మద్యం ప్రియులు బీర్లవైపు మొగ్గు చూపుతున్నారు. కానీ ఒక్కసారిగా బీర్ల ధరలు పెరగడంతో మద్యం ప్రియులు కంగుతిన్నారు. ఒక్కో బీర్‌పై రూ.30 నుంచి రూ.40 చొప్పున పెరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఆయా కంపెనీల కమీషన్‌తోపాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరగనుంది. వేసవిలో సుమారు 25 నుంచి 30శాతం అధికంగా బీర్ల అమ్మకాలు ఉంటాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా పెరిగిన ధరలను ఈ నెల 11 నుంచే అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

12వ తేదీ నుంచి అమలు



పెరిగిన బీర్ల ధరలను అమలు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 12న ఉత్తర్వులు జారీ చేసింది. ఆలోపు వరకు షాపుల్లో ఉన్న బీర్లను పాతధరలకు మాత్రమే విక్రయించాలి. కొత్త ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే మద్యం దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. పెరిగిన ధరల ద్వారా ఉమ్మడి జిల్లాలో రూ.వంద కోట్ల అదనపు ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

–జానయ్య, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్



పెరిగిన ధరలు ఇలా...

కంపెనీ	పాత ధర	కొత్తధర	పెరిగిన ధర
కింగ్‌ఫిషర్ లైట్ బీరు	150	180	30
కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్	160	190	30
బడ్వైజర్ లైట్‌బీరు	210	250	40
బడ్వైజర్ స్ట్రాంగ్	230	270	40
ఆర్‌సీ లైట్ బీరు	150	180	30
నాకౌట్ బీరు	160	190	30

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో శుక్రవారం మూల మూర్తులు స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి పాల్గొన్నారు.

19 నుంచి వ్యవసాయ కళాశాలలో క్రీడా పోటీలు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని నాలుగు జోన్ల బోధన సిబ్బందికి క్రీడా, సాంస్కృతిక, సాహిత్య, ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్ తెలిపారు. ఈ నెల 19, 20, 21వ తేదీల్లో కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించే పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ విక్రాంత్ కుమార్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అన్ని కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా నేరాలను అరికట్టే అవకాశం ఉందని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అయ్యప్ప, రెవెన్యూ కాలనీల ప్రజలతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, చోరీలు అరికట్టేందుకు కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా గంజాయి సేవించినా, విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. సీఐ రమేష్ పాల్గొన్నారు.

గురుకుల అధ్యాపకుడికి డాక్టరేట్



దావా వేణు

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురానికి చెందిన అధ్యాపకుడు దావా వేణుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఆయన కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ ఫ్యూచర్ వోలాటాలిటీ ఆన్ ఈక్విటీ మార్కెట్ విత్ రిఫరెన్స్ టు ఎన్ఎస్ఈ ఇండియా'అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ప్రస్తుతం అన్నపురెడ్డిపల్లిలోని బీసీ గురుకుల కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న వేణును అధ్యాపకులు అభినందించారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జీఎం హెచ్‌కే.శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

అశ్వాపురం: క్రీడా పోటీలతో పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగుల మధ్య స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో మణుగూరు భారజల కర్మాగారం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జరుగుతున్న అణుశక్తి విభాగం 39వ జాతీయ క్రీడా, సాంస్కృతిక పోటీలు శుక్రవారం ముగిశాయి. కాలనీలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించగా, ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. విజేతలు, రన్నరప్, టీం చాంపియన్‌షిప్, క్రీడాకారులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం జీఎం హెచ్‌కే.శర్మ, డీజీఎం శ్రీనివాసరావు, రఫీక్ అహ్మద్, అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

ఇల్లెందురూరల్: పదో తరగతిలో నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. మండలంలోని రొంపేడు బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో వంట గదులు, వాష్ రూమ్స్, తరగతి గదులు, డార్మెటరీని పరిశీలించారు. వంట గదుల వద్ద శుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో వాటర్‌ప్లాంట్, నూతన కిచెన్‌షెడ్డు, లైట్లు, ఫ్యాన్లు, మెస్ డోర్స్ ఏర్పాటు, పెయింటింగ్, నీటి వనరుల మెరుగు తదితర సౌకర్యాల కల్పనపై దృష్టిసారిస్తామన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపించాయని, విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇతర తరగతుల్లో ప్రయోగాత్మక విద్యాబోధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఏటీడీఓ సూర్నపాక రాధమ్మ, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనోత్పత్తితో రైతులకు మేలు



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త ప్రభావతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులు పండించే పంటల ద్వారా విత్తనోత్పత్తి చేసుకుంటే వారిపై భారం తగ్గుతుందని శాస్త్రవేత్తలు సూచించారు. కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్‌లోని విత్తన పరిశోధన, సాంకేతిక సెంటర్ ఆధ్వర్యాన కొత్తగూడెం కేవీకేలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి తదితరులు మాట్లాడారు. రైతులు కొన్ని మెళకువలు పాటిస్తే సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. అపరాల పంటల విత్తనోత్పత్తిపై అవగాహన కల్పించగా, శాస్త్రవేత్తలు డాక్టర్ సుకుమార్, డాక్టర్ స్వర్ణలత వరి, మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులను వివరించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, వివిధ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో డీఎఫ్ఓ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ కృష్ణాగౌడ్

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలైన వెంకటాపురం, ఎలకలగూడెం గ్రామ పంచాయతీల్లో డీఎఫ్ఓ కృష్ణాగౌడ్ శుక్రవారం పర్యటించారు. వెంకటాపురం, మామిళ్లవాయి గ్రామాల్లో ప్లాంటేషన్, జంతువులకు నీటి వసతిని పరిశీలించారు. అటవీ, వైల్డ్‌లైఫ్ అనుమతులు లేని వెంకటాపురం–మామిళ్లవాయి రహదారిని, బండ్లవారిగుంపులో ఏర్పా టు చేస్తున్న ఫారెస్ట్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బాబు, యానంబైలు రేంజర్ కవితామాధురి, రేంజర్ రమేష్, సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నయా మాస్టర్ ప్లాన్..

- రూపకల్పనకు నేటి నుంచి డ్రోన్ సర్వే
- కొత్తగూడెం పట్టణంలో 53 పాయింట్లు ఏర్పాటు
- అమృత్ 2.0 పథకంలో అభివృద్ధికి అడుగులు
- మరో 50 ఏళ్లపాటు విస్తరణకు ఆటంకం లేకుండా ప్రణాళిక



కొత్తగూడెం పట్టణ వ్యూ

కొత్తగూడెంఅర్బన్: రానున్న యాభై ఏళ్ల అభివృద్ధే లక్ష్యంగా కొత్తగూడెం మున్సిపాలిటీకి నూతన మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా పట్టణంలో శనివారం నుంచి సర్వే ప్రారంభించనున్నారు. ఇందుకోసం పట్టణంలో 53 పాయింట్లు ఏర్పాటు చేసి, గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం చేశారు. అధునాతన డ్రోన్ సహాయంతో మూడు రోజులపాటు సర్వే నిర్వహించనున్నారు. ఇప్పటికే మున్సిపల్ అధికారులు సర్వేకు సంబంధించిన ఏర్పాట్లు సిద్ధం చేశారు. సర్వే అనంతరం ప్లాన్ రూపొందించి పంపితే ప్రభుత్వం పరిశీలించి ఆమోదిస్తుంది. ఆ తర్వాత కొత్తగూడేనికి అమృత్ పథకం నిధులు వచ్చే అవకాశం ఉంటుంది. తద్వారా మున్సిపాలిటీలో అభివృద్ధి వేగవంతంకానుంది. ఇప్పటికే కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా), కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జీఓలు విడుదల చేసిన విషయం విదితమే. తాజాగా కొత్త మాస్టర్ ప్లాన్ కోసం సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కేంద్ర బృందం, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంతో కలిసి సర్వే నిర్వహించనుంది. తుదిగా మాస్టర్ ప్లాన్ నివేదికను డీటీసీపీకి, ప్రభుత్వానికి పంపిస్తారు. ప్రభుత్వం ఆమోదించాక పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నారు.

కొత్త ప్లాన్‌తో అమృత్ నిధులు

కొత్తగూడెం మున్సిపాలిటీ 1971 సంవత్సరంలో ఏర్పడగా, 1974 సంవత్సరంలో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. 50 ఏళ్లనాటి మాస్టర్ ప్లానే ఇంకా అమలు చేస్తుండటంతో పట్టణాభివృద్ధి ప్రణాళికాబద్ధంగా సాగడంలేదు. కొత్తగూడెం జిల్లా కేంద్రమైనప్పటి నుంచీ వాహనాల రద్దీ పెరిగింది. జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. ఇరుకు రోడ్లలో వాహనాలు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. ప్రధానంగా పార్కింగ్ జోన్లు లేవు. క్రమంగా రెసిడెన్షియల్ ఏరియాలు కమర్షియల్ ఏరియాలుగా మారాయి. ఆయా ఏరియాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో 51 సంవత్సరాల తర్వాత కొత్త మాస్టర్‌ప్లాన్‌కు ఉపక్రమించారు. మూడు రోజులపాటు చేపట్టనున్న సర్వేలో కమర్షియల్, రెసిడెన్షియల్ ఏరియాలను, జోనల్ పరిధి, అటవీ, వ్యవసాయ ప్రాంతాలను గుర్తించనున్నారు. ఇక కొత్త మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే భవన నిర్మాణాలకు అనుమతులు లభించే అవకాశం ఉంటుంది. రోడ్ల విస్తీర్ణం, గ్రీనరీ, పార్కులు పెరగడంతో పార్కింగ్ జోన్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య తొలగిపోయే అవకాశం ఉంటుంది. అమృత్ స్కీం నిధులతోపాటు కుడా, కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియ కూడా పూర్తయితే.. మూడింటి నిధులతో కొత్తగూడెంలో అభివృద్ధి వేగవంతం కానుంది. ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశంఉంది.

నేటి నుంచి సర్వే



కొత్తగూడెం మున్సిపాలిటీకి నూతన మాస్టర్ ప్లాన్ కోసం శనివారం నుంచి డ్రోన్ సర్వే ప్రారంభం కానుంది. పట్టణంలో సర్వే కోసం 53 పాయింట్లను ఏర్పాటు చేశాం. సర్వే ఆఫ్ ఇండియా బృందం మూడు రోజులపాటు సర్వే నిర్వహించనుంది.

–శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపాలిటీ కమిషనర్

జీవన ప్రమాణాలు పెరుగుతాయి



కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించి అమలు చేస్తే అధికంగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. సౌకర్యాలు పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉండదు. పార్కింగ్ జోన్లు, రోడ్ల విస్తీర్ణం వాహనదారులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

–అబ్దుల్ ఖదిర్, మున్సిపల్ టీపీఓ

విద్యార్థుల ఉన్నతికి 'కెరీర్ గైడెన్స్ వాల్'

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: పదో తరగతి అనంతరం గిరిజన విద్యార్థుల ఉన్నతి కోసం భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో తొలిసారిగా కెరీర్ గైడెన్స్ వాల్ ప్రారంభిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. భద్రాచలంలోని ఏజీహెచ్ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన విద్యాసంస్థల్లో పదో తరగతి చదువుతున్న బాలికలు ఆ తర్వాత ఉన్నత విద్య, గ్రాడ్యుయేషన్‌లో ఎంపిక చేసుకోవాల్సిన విభాగాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని అన్నారు. ఐటీడీఏ పరిధిలోని ప్రతీ గిరిజన పాఠశాలలో కెరీర్ గైడెన్స్ వాల్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ అధికారులు పాఠశాలలకు వచ్చి అవగాహన కల్పిస్తారని వివరించారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేలా బోధించాలని, పరీక్షల్లో ఉత్తీర్ణత, తదుపరి కోర్సులపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పలువురు విద్యార్థినులు భవిష్యత్‌లో తమ లక్ష్యాలను వెల్లడించగా అందుకోసం సిద్ధం కావాల్సిన తీరును పీఓ, అధికారులు వివరించారు.

23న ప్రతిభాపరీక్ష

ఈ నెల23న విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష నిర్వహించనున్నట్లు పీఓ రాహుల్ తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి మొదటి ఐదు స్థానాల విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, ఏసీఎంఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

18న బంద్‌కు మావోయిస్టుల పిలుపు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పోలీసులు మారణకాండ కొనసాగిస్తున్నారని ఆరోపిస్తూ, ఇందుకు నిరసనగా ఈనెల 18న బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాల బంద్ పాటించాలని మావోయిస్టు పార్టీ దక్షిణ బస్తర్ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి సమత పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సమత పేరిట ఒక లేఖ విడుదలైంది. ఈ నెల 9న బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మావోయిస్టులు సమావేశమయ్యారని ఇన్‌ఫార్మర్లు ఇచ్చిన సమాచారంతో చుట్టుముట్టిన పోలీసులు కాల్పులు జరిపారని పేర్కొన్నారు. పోలీసుల కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందగా, మరో 19 మంది గ్రామస్తులను బంధించి చిత్రహింసల అనంతరం హత్య చేశారని సమత ఆరోపించారు. ఇదేక్రమాన తోడ్కా గ్రామంలోనూ 8 మంది గిరిజనులను పట్టుకుని హత్య చేశారని వెల్లడించారు. ఈ ఘటనను నిరసిస్తూ 18న బీజాపూర్, సుక్మా, దంతెవాడ జిల్లాల బంద్‌ను పాటించాలని ఆమె కోరారు.

బస్సుకు ఎదురొచ్చిన అడవిదున్న



అడవిలోకి వెళ్తున్న అడవిదున్న

గుండాల: ఆర్టీసీ బస్సుకు అడవి దున్న ఒక్కసారిగా ఎదురురావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. మణుగూరు నుంచి గురువారం రాత్రి గుండాలకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా దామరతోగు – వెంకటాపురం అటవీమార్గంలో అడవి దున్న ఎదురొచ్చింది. దీంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును ఆపాడు. దున్నను చూసిన ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అయితే, పది నిమిషాల అనంతరం దున్న అడవిలోకి వెళ్లిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకోగా బస్సు ముందుకు కదిలింది.

బాలిక ఆచూకీ కనిపెట్టండి..



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న శివశంకర్

కొత్తగూడెంటౌన్: ఈ నెల 1వ తేదీన బూర్గంపాడులోని ఓ పాఠశాలలో చదువుతున్న బాలిక తప్పిపోయిందని, ఆమె ఆచూకీ కనిపెట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ ఎస్పీ రోహిత్‌రాజ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బాలిక 14 రోజుల నుంచి కనిపించకుండా పోయిందని, తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన లారీతో పోలీసులు

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం సమీపంలో 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొమరారం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. గుండాల సీఐ రవీందర్ కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం బోడు ప్రాంతం నుంచి మర్రిగూడెం మీదుగా వెళ్తున్న లారీని తనఖీ చేయడంతో రేషన్ బియ్యం దొరికాయి. పలు గ్రామాల్లో నుంచి సేకరించిన రేషన్ బియ్యంను ఖమ్మానికి లారీలో తరలిస్తూ పట్టుబడటంతో ఎస్‌ఐ సోమేశ్వర్ కేసు నమోదు చేశారని సీఐ తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించి, రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని, పట్టుబడ్డ వారిలో టేకులపల్లి మండలానికి చెందిన లాలు, దాస్‌తండాకు చెందిన లకావత్ జామా, కారేపల్లి మండలం గాదెపాడుకు చెందిన జంపాల గౌతమ్, జగ్గయ్యపేట ఇందిరానగర్‌కు చెందిన లారీడ్రైవర్ ఆకునూరి సురేశ్, క్లీనర్ సైదా ఉన్నారని సీఐ వివరించారు.

బెదిరించిన మహిళపై కేసు

ఇల్లెందు: పట్టణంలోని 24 ఏరియాకు చెందిన మేదరి నిర్మలను అదే ప్రాంతానికి చెందిన అమృత భవాని బెదిరించింది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. 24 ఏరియాలో నివాసం ఉంటున్న నిర్మల తన ఇంటి ఎదుట ఓ మహిళ దూషిస్తున్నట్లు విని బయటకు వెళ్లి చూసింది. అమృత భవాని అసభ్య పదజాలంతో దూషిస్తూ తన జోలికి వస్తే చంపుతానంటూ బెదిరించిందని నిర్మల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ సందీప్‌కుమార్ శుక్రవారం కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

నిధులు కాజేశారు!

- దుర్వినియోగమైన గ్రామ పంచాయతీల ఫండ్
- కొరవడిన జిల్లా పంచాయతీ అధికారుల పర్యవేక్షణ
- నిధుల స్వాహా ఘటనలో సారపాక సర్పంచ్, కార్యదర్శులకు జైలుశిక్ష



నిధులు దుర్వినియోగం జరిగిన సారపాక పంచాయతీ

చుంచుపల్లి: గ్రామాలను అభివృద్ధి పథంలోకి తేవాలని అధికారమిస్తే కొందరు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు అందినకాడికి కాజేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు కూడా వారికి తోడుగా నిలిచారు. బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. రూ.23.89 లక్షల ప్రజాధనాన్ని అప్పటి సర్పంచ్ ధరావత్ చందూనాయక్, పంచాయతీ కార్యదర్శి బత్తిన శ్రీనివాసరావు జాయింట్ చెక్ పవర్‌తో 2012లో దుర్వినియోగం చేశారని ఆరోపణలు వచ్చాయి. నేరం రుజువు కావటంతో గత మంగళవారం భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఇద్దరికీ రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

తీర్మానాలు లేకుండానే పనులు

జిల్లాకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ప్రతి ఏటా రూ.110 కోట్ల వరకు విడుదల అవుతున్నాయి. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల పరిధిలో 8,38,153 గ్రామీణ జనాభా ఉంది. జనాభా ప్రాతిపదికన ప్రతి నెలా ప్రభుత్వం అన్ని పంచాయతీలకు రూ.9.32 కోట్లను విడుదల చేస్తుంది. వీటితోపాటు ఇంటి పన్నులు, సంతలు, ఇసుక రీచ్‌ల నుంచి కూడా ఆదాయం వస్తుంది. జిల్లా పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సర్పంచులు, కార్యదర్శులు, ఉప సర్పంచులు కుమ్మక్కై నిధులు దోచేశారు. పాలకవర్గ తీర్మానాలు లేకుండా పనులు చేపడుతూ నిధులు కాజేశారు. ఇక మహిళలు సర్పంచులుగా కొనసాగిన చోట వారి భర్తల పెత్తనమే సాగింది. కాగా గత సర్పంచ్‌ల పదవీ కాలం 2024 ఫిబ్రవరి 2తో ముగియగా, ఆ టర్మ్‌లో పనిచేసిన కొందరు సర్పంచ్‌లపై కూడా ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

అత్యవసరాల పేరుతో డ్రా చేస్తూ..

అత్యవసరాల పేరుతో సర్పంచ్‌లు నిధులు డ్రా చేస్తూ కాజేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యదర్శులపై సస్పెన్షన్‌కు కూడా గురయ్యారు. నిధుల లెక్క తేల్చేందుకు ఏటా నిర్వహిస్తున్న అంతర్గత ఆడిటింగ్ ప్రక్రియ ప్రహసనంగా సాగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాల్లో ఉన్న నిధులు, పెట్టిన ఖర్చు, అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారా? ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టారా..? వంటి విషయాలపై జిల్లా పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేదు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్, ఉపసర్పంచులు, కార్యదర్శులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



గ్రామపంచాయతీల్లో నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. ఇటీవల సారపాక విషయంలో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష పడింది. జరిగిన అవినీతి ఆధారంగా కలెక్టర్ ఆదేశాల మేరకు బాధ్యతల నుంచి పూర్తిగా తొలగిస్తాం. ఇక నుంచి ప్రతి పంచాయతీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి పెడతాం.

–వి.చంద్రమౌళి, డీపీఓ

కొన్ని ఘటనలను పరిశీలిస్తే..

- ములకలపల్లి మండలం సీతారాంపురం ఇసుక నిధులకు తహసీల్దార్ చెక్కు జారీ చేస్తే సొంత అకౌంట్‌లో జమ చేసుకోవడంతో అప్పటి సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు పడింది.
- దమ్మపేట పంచాయతీలో నిధుల దుర్వినియోగం కావడంతో సర్పంచ్, ఉపసర్పంచ్‌లను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కాగా వారు కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకుని చివరి వరకు కొనసాగారు.
- అవినీతి, అక్రమాలు తదితర ఆరోపణలతో 2022లో పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌ను అప్పటి కలెక్టర్ అనుదీప్ పదవి నుంచి పూర్తిగా తొలగించారు.
- బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన రూ.1.27 కోట్లను సర్పంచ్, ఉపసర్పంచులు తమ భర్తల ఖాతాల్లోకి మళ్లించారనే ఆరోపణల నేపథ్యంలో 2022 మార్చిలో కలెక్టర్ సర్పంచ్, ఉపసర్పంచ్‌లపై సస్పెన్షన్ వేటు వేశారు.
- జూలూరుపాడు మండలం శంభునిగూడెం ఉపసర్పంచ్, ఇల్లెందు మండలం బాలాజీనగర్ ఉపసర్పంచ్, ఏడూళ్లబయ్యారం ఉపసర్పంచ్ కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు.

వన దేవతలకు ప్రణమిల్లి..

సమ్మక్క, సారలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



కరకగూడెం: సమ్మక్క, పగిడిద్దరాజు కల్యాణం జరిపిస్తున్న పూజారులు

కరకగూడెం: గిరిజనుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క, సారలమ్మ జాతర మండలంలోని చిరుమళ్ల గ్రామంలో నాలుగు రోజుల నుంచి సాగుతోంది. శుక్రవారం వన దేవతలను దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం రాత్రి సమ్మక్కకు పగిడిద్దరాజుతో కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ బాధ్యులు ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేసి కల్యాణ మహోత్సవాన్ని ప్రదర్శించారు.



వన దేవతల దర్శనానికి వేచిచూస్తున్న భక్తులు

అర్ధరాత్రి వరకు కూడా భారీగా భక్తులు రావడంతో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా శుంకు పండుగ..

సమ్మక్క సారలమ్మ జాతరలో శుంకు పండుగకు ప్రాముఖ్యత ఉంది. మొదట ధాన్యాన్ని తీసుకొచ్చి వాటిని వన దేవతల గద్దెలపై చేర్చి ఇలవేల్పుల కర్రెలను వాటిలో ఉంచి ముగ్గులు పోసి పసుపు, కుంకుమ కలిపి ఒక కోడిని కరిముట్టించి, కొబ్బరికాయ కొట్టి అందులోని నీళ్ల ధాన్యంలో పోసి వచ్చిన భక్తులకు ఇస్తారు. ఈ ధాన్యాన్ని రైతులు వారి పొలంలో వేస్తే పంట బాగావస్తుందని నమ్మకం. శుంకు పండుగగా పిలిచే ఈ కార్యక్రమంలో వివిధ రకాల వంటకాలను తయారు చేసి ప్రసాదంగా పంచుకుంటారు.

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఇల్లెందు: స్థానిక బస్టాండ్ సమీపంలోని బండెలమల్లయ్య కుంట సమీపంలో వివాదాస్పద సమాధుల స్థలాన్ని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సందర్శించారు. అక్కడి స్థలం తమదేనంటూ ఓ ముస్లిం కుటుంబం చుట్టూ కంచె నిర్మించగా.. ఆ స్థలం సమాధుల స్థలమని ఆర్‌సీఎం చర్చి పాస్టర్లు, భక్తులు పేర్కొంటున్నారు. అయితే స్థానిక అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు వివాదంపై పంచాయతీ నిర్వహించినప్పటికీ ఓ వర్గం సంతృప్తి చెందకపోవడంతో కలెక్టర్ సూచనతో స్థానిక తహసీల్దార్ ఇరు వర్గాల మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నం చేశారు. అయినా ససేమిరా అనటంతో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శుక్రవారం సమాధుల స్థలం వద్దకు వచ్చి ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత కలెక్టర్ మాట్లాడారు. ఘర్షణ పడితే కుదరదని, ఇరు వర్గాలూ కోర్టుకు వెళ్లాలని, ఎవరి వాదనలు నిజమైతే వారికి కోర్టు నుంచి వచ్చే తీర్పు తర్వాత భూమి అప్పగిస్తామని స్పష్టం చేశారు. అప్పటివరకు ఈ భూమి వివాదంలో ఉందని, ఇరు వర్గాలు ఈ భూమిలోకి రాకుండా బోర్డు ఏర్పాటు చేస్తామని తేల్చి చెప్పారు. అధికారులదే తుది నిర్ణయమని, శాంతి భద్రతల సమస్య సృష్టించొద్దని పేర్కొన్నారు. ఇదిలాఉండగా తమకు పురాతన పత్రాలు ఉన్నాయని ముస్లిం కుటుంబం చెప్పగా.. అలాంటప్పుడు తమ దృష్టికి తీసుకుని రావాలని, సమాధులు కూల్చే హక్కు ఎవరిచ్చారని, కంచె ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ఇరువర్గాలు అధికారుల నిర్ణయానికి కట్టుబడి ఉంటే జిల్లాస్థాయిలో శాశ్వత పరిష్కారం చూపుతామని కలెక్టర్ వెల్లడించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రవికుమార్, ఆర్‌ఐ ముత్తయ్య, రెవెన్యూ సిబ్బంది, ముస్లిం కుటుంబం, ఆర్‌సీఎం చర్చి పాస్టర్‌లు, చర్చి కమిటీ సభ్యులు ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



సునీల్ (ఫైల్)

పాల్వంచరూరల్: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయలైన ఘటన నారాయణరావుపేట వద్ద చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దంతలబోరు ఎస్సీకాలనీకి చెందిన జినుగు రమేశ్, ఉమ దంపతుల కుమారుడు సునీల్ (23) పాల్వంచలోని పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ఇంటికి వచ్చి తన మిత్రుడు, జయమ్మకాలనీకి చెందిన సతీశ్, అతని ఎనిమిదేళ్ల కుమారుడితో కలిగి ద్విచక్రవాహనంపై పాల్వంచకు వెళ్తున్నారు. నారాయణరావుపేట వద్దకు రాగానే ట్రాక్టర్ ఢీకొట్టడంతో ముగ్గురికి గాయలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సునీల్‌ను ఖమ్మంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడికి గాయాలు

మండలంలోని మొర్రేడువాగు సమీపంలోని సంగం బ్రిడ్జి వద్ద ములకలపల్లి మండలం సుందర్‌నగర్‌కు చెందిన రవ్వ వినోద్ గురువారం ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐని వివరణ కోరగా ప్రమాదం జరిగినట్లు ఎలాంటి సమాచారం లేదన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. అశ్వారావుపేట పరిధిలోని ఇందిరాకాలనీకి చెందిన తానికొండ వెంకటేశ్వర్లు (58) గత నెల 28వ తేదీ రాత్రి కాలినడకన వస్తున్న క్రమంలో జంగారెడ్డిగూడెం మార్గంలో లారీ ఢీకొట్టింది. గాయపడిన వెంకటేశ్వర్లును కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చాక గురువారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురవడంతో ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడి భార్య తానికొండ చిట్టెమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోల్ గుమస్తా ఆత్మహత్య



నాగభూషణం(ఫైల్)

ఇల్లెందు: ఇల్లెందులోని డీ–బ్లాక్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం కోల్ గుమస్తాల ఆఫీస్‌లో ఉరి వేసుకుని గుమస్తా నాగభూషణం (40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే, రెండేళ్లుగా డీ–బ్లాక్ వద్ద బొగ్గు రవాణా నిలిచిపోవడం, గుమస్తాకు ఉపాధి లేకుండా పోవడం, కుటుంబ భారం పెరిగి ఆత్మహత్యకు పాల్పడినట్లు అక్కడి గుమస్తాలు తెలిపారు. కాగా, డీ–బ్లాక్ వద్ద గుమస్తా నాగభూషణం మృతి చెందినట్లు సమాచారం అందటంతో ఇల్లెందు పోలీసులు వెళ్లి పరిశీలించారు. కారేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అయితే, మృతుడు ఉరి వేసుకున్న ప్రాంతం డీ–బ్లాక్ కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో అక్కడి పోలీసుల రాక కోసం మృతదేహాన్ని కిందకు దించలేదు. పోలీసుల రాక ఆలస్యం అవుతుండటం, గంటల కొద్ది సమయం మృతదేహం వేలాడుతుండటం అక్కడివారిని కలచివేసింది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, కోల్ ట్రాన్స్‌పోర్ట్ గుమస్తాలు, లారీఓనర్లు, డ్రైవర్లు, వర్కర్లు వచ్చి సంతాపం తెలిపారు.

ప్రేమ విఫలమైందని యువకుడు...

పాల్వంచ: ప్రేమ విఫలమైందనే ఆవేదనతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం ముస్సుపూర్‌కు చెందిన ఎస్‌కే గోలమ్ (19) పాల్వంచలోని ఓ కాంట్రాక్టర్ వద్దకు తన మేనమామ రెహ్మతుల్లాతో కలిసి గత నెలలో వచ్చాడు. అయితే, గురువారం పనికి వెళ్లిన గోలమ్ రాత్రి వరకు తిరిగి రాకపోగా ఫోన్ చేసినా తీయలేదు. రాత్రంతా వెతుకుతుండగా ఆయన ఫోన్ ఇంటి సమీపంలోని అటవీ ప్రాంతంలో వినిపిస్తుండటంతో పరిశీలించాడు. చెట్టుకు ఉరి వేసుకుని ఉన్న గోలమ్ కనిపించడంతో దింపి చూసేసరికి మృతి చెందాడు. గోలమ్ తమ స్వగ్రామంలో ఓ యువతిని ప్రేమిస్తున్నాడని, ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని రెహ్మతుల్లా ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు.

ప్రాణం తీసిన గ్రానైట్ రాళ్లు

- డీసీఎం బోల్తా పడడంతో ఇద్దరు మృతి
- బతుకుదెరువు కోసం వచ్చి మృత్యువాత



హుస్సేన్ (ఫైల్)

ముదిగొండ: బతుకుదెరువు కోసం ఊరు కాని ఊరు వచ్చిన ఇద్దరు కార్మికులు మృత్యువాత పడ్డారు. గ్రానైట్ రాళ్లు తీసుకెళ్తున్న డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనం బోల్తా కొట్టగా అందులోని రాళ్లపై కూర్చున్న కార్మికులు కింద పడడం, వారిపై రాళ్ల పడడంతో తీవ్రగాయాల పాలై మృతి చెందారు. ఇదే ఘటనలో మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లాలోని ముదిగొండ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

లోడ్ తీసుకొస్తూ...

ఖమ్మం ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలోని న్యూలక్ష్మీనరసింహ గ్రానైట్ పరిశ్రమ జయమాని గడి రాంబాబు శుక్రవారం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలోని గ్రానైట్ పరిశ్రమ నుంచి అన్‌పాలిష్, పీస్‌లు తీసుకురావాలని సూచించాడు. దీంతో డీసీఎంలో డ్రైవర్‌తో పాటు 9 మంది కూలీలు వెళ్లారు. అక్కడ గ్రానైట్ రాళ్లు లోడ్ చేసుకుని కైకొండాయిగూడెం వెళ్లే క్రమాన ముదిగొండ సమీపంలో డీసీఎం డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో వాహనం వెనుక టైర్ల నట్లు ఊడిపోయి అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో గ్రానైట్ రాళ్లపై కూర్చుని వస్తున్న బానోత్ హుస్సేన్(28), నూనావత్ వీరన్న(35)పై రాళ్లు పడగా పొట్టలోకి దిగడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఇదేఘటనలో బానోత్ దాసు, కర్ణ, అశోక్, కుమార్, సుందర్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. ఈ మేరకు క్షతగాత్రులను 108 వాహనంలో ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుల కుటుంబీకుల ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు. కాగా, మృతుల్లో హుస్సేన్ స్వగ్రామం భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం తొండలబాల తండా కాగా, వీరన్నది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రాము తండా అని పోలీసులు వెల్లడించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

చండ్రుగొండ: మండలంలోని దామరచర్ల గ్రామంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. జామాయిల్ తోటలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.3 వేల నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, ఆరుగురు పరారయ్యారని ఏఎస్‌ఐ పాపారావు వెల్లడించారు.


మూకమామిడి ప్లాంటేషన్‌లో అగ్ని ప్రమాదం



ఎగసిపడుతున్న మంటలు

ములకలపల్లి: మండలంలోని మూకమామిడి గ్రామ శివారులోని ప్లాంటేషన్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న జామాయిల్ ప్లాంటేషన్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. జామాయిల్ తోట అగ్నికి ఆహుతైనట్లు సమాచారం. ఆ సమయంలో ఫైర్ ఇంజన్ వచ్చినా రహదారి సౌకర్యం లేకపోవడంతో వెనుదిరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం వేళ గాలలకు మంటలు మరింత ఉధృతం కావడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు మంటలను అదుపులోకి తేవడంతో ప్రమాదం తప్పింది. ఘటనా ప్రదేశాన్ని ఎస్‌ఐ కిన్నెర రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ రామారావు వివరాలు సేకరించారు.

ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పూరిల్లు

పినపాక: ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని సీతంపేట గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. సీతంపేట గ్రామంలో పూస వెంకటేశ్‌కు చెందిన ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించి మంటలార్పడానికి ప్రయత్నించారు. ఫైర్ ఇంజన్ వచ్చేసరికి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్ కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు అందజేశారు.

జేసీబీ, టిప్పర్ సీజ్



సీజ్ చేసిన జేసీబీ, టిప్పర్

దమ్మపేట: అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న జేసీబీ, టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం మండలంలోని గట్టుగూడెం శివారులో జేసీబీతో మట్టిని తవ్వి, టిప్పర్‌లో లోడ్ చేసి, తరలిస్తుండగా అటువైపు వెళ్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణి గుర్తించారు. జేసీబీ, మట్టి రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అంతకుముందు ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను దమ్మపేట పోలీస్ స్టేషన్ ఎదుట అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని అనంతారం గ్రామ శివారులోని వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున అశ్వారావుపేట బస్టాండ్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ డ్రైవర్ రాంబాబు, యజమాని సురేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు..

టేకులపల్లి: రెండు ఇసుక ట్రాక్టర్లను టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి సులానగర్ సమీపంలో టేకులపల్లి ఎస్‌ఐ సురేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టిన క్రమంలో ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి.. అజ్మీర ప్రశాంత్, అజ్మీర మాన్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.